ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 16 జూన్ 2024

ఇక డీఎంకే ద్రావిడ తరహా పాలన



ముప్పేరుంవిళాకు తరలివచ్చిన జనసందోహం, (ఇన్‌సెట్‌లో) సభలో ప్రసంగిస్తున్న స్టాలిన్

- మైనారిటీ ఎన్డీయే అహంకారాన్ని అణచివేస్తాం
- కోవైలో ఘనంగా 'ముప్పేరుంవిళా'

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇకపై డీఎంకే ద్రావిడ తరహా పాలనే శాశ్వతంగా వుంటుందని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే స్థానాలను కూడా కైవసం చేసుకుంటామని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి దూకుడుకు 'ఇండియా' కూటమి కళ్లెం వేసిందని, ఫలితంగా మెజారిటీలేని మైనారిటీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగలిగిందన్నారు. పదేళ్లుగా మెజారిటీ బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంట్‌లో పాలకులను గడగడలాడించిన డీఎంకే కూటమి ఎంపీలు ఈసారి పాలకుల అహంకారాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తారన్నారు. కోయంబత్తూరు కొడీసియా మైదానంలో శనివారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు ఉత్సవం, లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి గెలుపుకు పాటుపడిన పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు సన్మానోత్సవం, 40 నియోజకవర్గాలకు చెందిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపే ఉత్సవ సమ్మేళనంతో ఏర్పాటైన త్రివిధ ఉత్సవాల (ముప్పేరుంవిళా) సభలో ఆయన ప్రసంగించారు. ఎన్డీయే గెలుపుకోసం, రాష్ట్రంలో తామరను వికసింపజేసేందుకు ఎనిమిది సార్లు ప్రధాని మోదీ ప్రచారానికి వచ్చినా తమిళ ప్రజలు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ తనకు ఆప్యాయంగా స్వీట్‌బాక్స్ కానుకతో మోదీ చేసిన 8మార్లు ప్రచారం కొట్టుకుపోయిందని వ్యాఖ్యానించారు. కూటమి బలం వల్లే ఈ చారిత్రక విజయం సాధించామన్నారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనకు రాష్ట్ర ప్రజలు సంపూర్ణ సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఇండియా కూటమిని గెలిపించారని చెప్పారు. 2004లో లోక్‌సభ ఎన్నికల్లో వాజ్‌పాయి అధికారంలోకి వస్తారంటూ ప్రసారమాధ్యమాల సర్వేలన్నీ తెలిపాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చిందని, ఆ రీతిలోనే తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 400 సీట్లకు పైగా గెలుచుకుంటుందని చెప్పిన సర్వే ఫలితాలు తలకిందులై, పదేళ్లుగా మెజారిటీతో పాలించిన బీజేపీని మైనారిటీ ప్రభుత్వంగా మార్చేసిందన్నారు. 28 పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటైనప్పటి నుంచి బీజేపీ పాలకుల గుండెల్లో గుబులు పుట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మైనారిటీలకు వ్యతిరేకంగా విమర్శలు చేసినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత మైనారిటీ బీజేపీ ప్రభుత్వానికి తన చిరకాల స్నేహితుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నుంచి మద్దతు పొందాల్సిన ఆగత్యం ఏర్పడిందన్నారు. నాలుగు వందల సీట్లను సంపాదించుకుంటామని గొప్పలు చెప్పుకున్న ఎన్డీయే దూకుడుకు కళ్లెం వేసి 240 సీట్లకే పరిమితమయ్యేలా చేసిన ఘనత ఇండియా కూటమి దక్కిందన్నదే చారిత్రక వాస్తవమని అన్నారు. పదేళ్లుగా మెజారిటీ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెండు సభలలోనూ ఎక్కువగా ప్రశ్నలు వేసి ప్రధాని మోదీ, మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌ను ముప్పుతిప్పలు పెట్టారనే విషయాన్ని మరువకూడదని, డీఎంకే ఎంపీల విమర్శలకు, ఆరోపణలకే బీజేపీ మంత్రులంతా అధికంగా సమాధానాలు చెప్పారన్నదే వాస్తవమన్నారు. ఎన్డీయే ప్రభుత్వ అహంకారాన్ని అణగదొక్కేలా రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా రాజ్యాంగ ధర్మాసనాన్ని పరిరక్షించేందుకు, ప్రజా సమస్యలపై ప్రశ్నలు వేసి తమ కర్తవ్యాన్ని నెరవేర్చనున్నారని స్టాలిన్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పొందిన అన్నాడీఎంకే విక్రవాండి ఉప ఎన్నికను బహిష్కరించడం విడ్డూరంగా ఉందన్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుతమున్న అన్నాడీఎంకే నియోజకవర్గాలను కూడా కైవశం చేసుకుని 200 సీట్లకు పైగా గెలుచుకుంటామని, ఇది తాను గర్వంతో చెప్పడం లేదని, రాష్ట్ర ప్రజలు డీఎంకే ద్రావిడ తరహా పాలనపై పెట్టుకున్న నమ్మకాన్ని బట్టే చెబుతున్నానని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వమే అధికారంలో కొనసాగనుందని చెప్పారు.

స్టాలిన్‌కు ఘనస్వాగతం...

ముప్పెరుంవిళాలో పాల్గొనే నిమిత్తం నగరం నుంచి విమానంలో బయలుదేరి శనివారం మధ్యాహ్నం కోయంబత్తూరు చేరుకున్న స్టాలిన్‌కు పార్టీ ప్రముఖులు, మంత్రులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ వేడుకలలో పాల్గొనేందుకు మంత్రి ఉదయనిధి శుక్రవారం సాయంత్రమే కోయంబత్తూరు చేరుకున్నారు. ఈ సభలో డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, ద్రావిడ కళగం నేత కే వీరమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎండీఎంకే ఎంపీ దురై వైగో, సీపీఎం కార్యదర్శి బాలకృష్ణన్, సీపీఐ కార్యదర్శి ముత్తరసన్, డీపీఐ నేత తిరుమావళవన్, ముస్లింలీగ్ నేత కేఎం ఖాదర్ మొయిద్దీన్ కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి ప్రధాన కార్యదర్శి ఈఆర్ ఈశ్వరన్, తమిళగ వాళ్వురిమై కట్చి వ్యవస్థాపక అధ్యక్షుడు వేల్‌మురుగన్, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవాహిరుల్లా, ఆదితమిళర్ పేరవై నాయకుడు అదియమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా వేదికపైకి స్టాలిన్..

ఈ సమావేశానికి డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆలస్యంగా విచ్చేశారు. ఆరుగంటల నుండి 7.30 గంటల దాకా డీఎంకే మిత్రపక్షాల నాయకులంతా ప్రసంగించారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై మాట్లాడుతున్న వేళ ఉన్నట్టుండి సభలో కలలకం బయలుదేరింది. స్టాలిన్ వ్యాన్‌లో సభ వేదిక వద్దకు వస్తున్న వీడియో దృశ్యం ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రసారమైంది. దీనితో స్టాలిన్ వర్ధిల్లాలి అంటూ సభికులంతా పెద్దపెట్టున నినాదాలు చేశారు. వెంటనే సెల్వపెరుంతగై తన ప్రసంగాన్ని అర్థాంతరంగా ఆపివేశారు. రాత్రి 7.45 గంటలకు ఆయన వేదికపైకి వచ్చారు. ఆ తర్వాత వేదికపై ఆశీనులైన ఎంపీలందరినీ పలకరించిన తర్వాత తన కుర్చీలో ఆశీనులయ్యారు. సెల్వపెరుంతగై తన ప్రసంగాన్ని కొనసాగించి ముగించారు. ఆ తర్వాత ద్రావిడ కళగం నేత వీరమణి ప్రసంగించిన తర్వాత స్టాలిన్‌ను మిత్రపక్షాల నాయకులంతా కలిసి ఘనంగా సత్కరించారు. వెండి రాజదండాన్ని కానుకగా ఇచ్చారు. ఆ తర్వాత రాత్రి 8.15 గంటలకు ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు.

ఒకే వేదికపై 40 మంది ఎంపీలు...

ఈ ముప్పెరుంవిళా కోసం కొటీసియా మైదానంలో 40 అడుగుల వెడల్పు, 150 అడుగుల పొడవునా విశాలమైన వేదికను నిర్మించారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన డీఎంకూ కూటమి ఎంపీలు 40 మంది ఒకే వరుసగా ఆశీనులయ్యేలా కుర్చీల వరుసను కూడా ఏర్పాటు చేశారు. వీరందరిని డీఎంకే సీయువజన విభాగం నేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్ శాలువలతో సత్కరించారు. ఈ సభలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిమంది కార్యకర్తలు విచ్చేశారు. శనివారం ఉదయమే విచ్చేసిన పార్టీ ప్రముఖులు, నేతలు, కార్యకర్తలకు పార్టీ స్థానిక శాఖ నిర్వాహకులు మంచినీరు, టీ, కాఫీలు, భోజన సదుపాయం, మరుగుదొడ్లు తదితర వసతులు కూడా కల్పించారు. మైదానం నలువైపులా సభా కార్యక్రమాలను వీక్షించడానికి అనువుగా భారీ సైజు ఎల్ ఈడీ స్క్రీన్‌లు కూడాఏర్పాటు చేశారు. ఈ సభ కారణంగా కోయంబత్తూరు నగరంలో ఉదయం ఆరు నుండి రాత్రి 11 గంటలకు భారీ వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు.

లోకేష్ రఘురామన్‌కు యువ పురస్కార్

యుమా వాసుకికి బాల సాహిత్య పురస్కార్



యువకథా రచయిత లోకేష్ రఘురామన్ - బాల సాహిత్య పురస్కార్ స్వీకరించనున్న యుమా వాసుకి

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా నన్నిలం ప్రాంతానికి చెందిన ప్రముఖ యువ కథా రచయిత లోకేష్ రఘురామన్ 2024వ సంవత్సరానికిగాను సాహిత్య అకాడమీ యువపురస్కార్‌కు ఎంపికయ్యారు. సాహిత్య అకాడమీ సంస్థ దేశంలోని 23 భాషలకు సంబంధించి యువ రచయితల కథానికలకుగాను యువపురస్కార్ అవార్డులకు ఎంపికైనవారి జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఆ మేరకు బెంగళూరు ఐటీ సంస్థలో పనిచేస్తున్న నన్నిలం ప్రాంతానికి చెందిన లోకేష్ రఘురామన్ తమిళంలో ఆయన మొట్టమొదటి సారిగా 'విష్ణు వందార్' పేరుతో రచించిన కథానికల సంపుటిగాను సాహిత్య అకాడమీ యువపురస్కార్‌కు ఎంపిక చేసింది. ఇదే విధంగా భారతి పుస్తకాలయం ప్రచురించిన 'తన్వియిన్ పిరందనాళ్' పుస్తకాన్ని రచించిన యుమా వాసుకికి సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార్‌ను ప్రకటించింది. తంజావూరు జిల్లా పట్టుకోటకు చెందిన యుమా వాసుకి అసలు పేరు మారిముత్తు. రచయిత, చిత్రకారుడు, అనువాదకుడు అంటూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగడించిన మారిముత్తు 2017లో మలయాళ రచయిత ఒవి విజయన్ రచించిన కాసాక్కిండ ఇతిహాసం గ్రంథాన్ని తమిళంలో అనువదించినందుకుగాను 2017లో సాహిత్య అకాడమీ అవార్డును కూడా అందుకున్నారు. కాగా రఘురామన్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన కువైట్ మృతుల అంత్యక్రియలు



శివశంకర్ భౌతికకాయానికి కుటుంబీకుల నివాళులు

అడయార్, జూన్ 15: ఇటీవల కువైట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో సజీవ దహనమైన తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్మికుల మృతదేహాలు ప్రత్యేక విమానంలో కొచ్చిన్‌కు రాగా, అక్కడ నుంచి అంబులెన్స్‌లలో రాష్ట్రానికి వచ్చాయి. ఈ మృతదేహాలకు వారివారి కుటుంబ సభ్యులు స్వస్థలాల్లో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ నెల 12వ తేదీన జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన కార్మికులతోపాటు దాదాపు 40 మందికిపైగా కార్మికులు మృత్యువాతపడ్డారు. ఈ మృతుల్లో తంజావూరు జిల్లా ఆదనూరు గ్రామానికి చెందిన రిచర్డ్ రాయ్ (28), తిరుచ్చి జిల్లా తిరువెరుంబూరుకు చెందిన రాజు (53), రామనాథపురం జిల్లా తెన్నవనూరు గ్రామానికి చెందిన రాము(65), కాట్టుమన్నార్ కోయిల్‌కు చెందిన చిన్నదురై, విల్లుపురం జిల్లా సెంజికృష్ణాపురానికి చెందిన మహ్మద్ షరీఫ్ (35) అనే కార్మికులు ఉన్నారు. వీరి మృతదేహాలతోపాటు కేరళ రాష్ట్రానికి చెందిన కార్మికుల మృతదేహాలు కూడా ప్రత్యేక విమానంలో వచ్చాయి. ఈ మృతదేహాలకు వారివారి స్వస్థలాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలను పూర్తి చేశారు. కాగా, మృతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం రూ.5లక్షల మేరకు పరిహారం అందజేసింది.

నగరానికి వచ్చిన శివశంకర్ మృతదేహం

ఈ అగ్నిప్రమాదంలో చనిపోయిన శివశంకర్ మృతదేహాన్ని కొచ్చిన్ నుంచి చెన్నైకు విమానంలో తీసుకొచ్చారు. స్థానిక రాయపురానికి చెందిన శివశంకర్ భౌతికకాయం శనివారం వేకువజామున 4 గంటలకు ఇంటికి చేరుకుంది. మృతదేహాన్ని చూసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. వారు చేసిన ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది. ఆ తర్వాత శివశంకర్ మృతదేహానికి రాయపురం ఎమ్మెల్యే ఐడ్రీమ్ మూర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఉదయం 9 గంటలకు స్థానిక కాశిమేడులోని శ్మశానవాటికలో శివశంకర్ అంత్యక్రియలను పూర్తి చేశారు.

డీఎంకే సీనియర్లపై లాల్గుడి ఎమ్మెల్యే అలక

- తాను చనిపోయినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన
- దిగ్భ్రాంతిలో పార్టీ శ్రేణులు



సౌందరపాండ్యన్

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ పెద్దలపై అలకబూనిన తిరుచ్చి జిల్లా లాల్గుడి నియోజకవర్గ డీఎంకే శాసనసభ్యుడు సౌందరపాండ్యన్ దిగ్భ్రాంతిగొలిపేలా నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటన వెలువరించారు. తాను చనిపోయినట్లు ఓ ప్రకటన సృష్టించిన ఆయన.. లాల్గుడి నియోజకవర్గం ఖాళీ అయిందంటూ ప్రకటించారు. దీంతో డీఎంకే శ్రేణులు దిగ్భ్రాంతి చెందాయి. ఈ విషయమై లాల్గుడికి చెందిన డీఎంకే సీనియర్ నాయకుడొకరు మాట్లాడుతూ.. ఇటీవల లాల్గుడి నియోజకవర్గంలో పర్యటించిన పార్టీ సీనియర్లు కొందరు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పరిశీలనలు జరిపారన్న కోపంతో ఈ సందేశాన్ని ఫేస్‌బుక్‌లో వెలువరించి ఉంటారని పేర్కొన్నారు. గంట తర్వాత ఆ సందేశాన్ని ఎమ్మెల్యే సౌందరపాండ్యన్ ఫేస్‌బుక్ నుండి తొలగించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా తిరుచ్చి జిల్లాకు చెందిన మంత్రి కేఎన్ నెహ్రూకు, సౌందరపాండ్యన్‌కు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయని స్థానికుల సమాచారం.

విద్యార్థులకు బహుముఖ పరిజ్ఞానం అవసరం

త్రిదండి చిన్న జీయర్‌స్వామి ఉద్బోధ

'సుందరకాండ'పై క్విజ్ పోటీలకు విశేష స్పందన



కార్యక్రమంలో చిన్న జీయర్‌స్వామి, అతిథులు, నిర్వాహకులు - పాల్గొన్న పుర ప్రముఖులు

ప్యారీస్, జూన్ 15: సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, విద్యార్థులు రాణించడానికి ఒక రంగంలో నైపుణ్యం సాధిస్తే సరిపోదని, బహుముఖ పరిజ్ఞానం కలిగి ఉంటేనే అద్భుత విజయం వరిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఉద్బోధించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)-చెన్నై విభాగం ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణంలోని సుందరకాండపై శనివారం నిర్వహించిన క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. చిన్న జీయర్ స్వామి మంగళా శాసనాలతో, ప్రత్యక్ష పర్యవేక్షణలో స్థానిక రాయపేట పీటర్స్ రోడ్డులో ఉన్న ఈఎస్ శేషమహల్‌లో రాత్రి 7.30 గంటలకి వేద పారాయణంతో క్విజ్ పోటీలు ఆరంభమయ్యాయి. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. క్విజ్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000, ప్రోత్సాహక బహుమతిగా ఐదుగురికి తలా రూ.1,000 చొప్పున చినజీయర్ స్వామి చేతుల మీదుగా బహూకరించి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి విద్యార్థులను ఉద్దేశించి అభిలాషిస్తూ..... విద్యార్థి దశ నుంచే సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. పిల్లలకు రామాయణంలోని కీలక ఘట్టాల గురించి అవగాహన కల్పించే విధంగా జెట్-చెన్నై వారు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరగాలని, ఆ దిశగా ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతో పాటు సమాజ సంక్షేమానికి సంబంధించిన విషయాలను కూడా నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అహోబిల రామానుజ జీయర్ స్వామి, మరి కొంతమంది వేద పండితులు పాల్గొని విజేతలను ఆశీర్వదించారు. జెట్-చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇందులో శ్రీ సిటీ అధినేత రవి సన్నారెడ్డి, గోపురం పసుపు సంస్థ అధినేత వైవీ హరికృష్ణ, పీవీఆర్ కృష్ణారావు, శ్రీ శ్రీనివాస పెరుమాళ్ ఆలయ ధర్మకర్త, చైర్మన్ వసంత్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా రాయపేట పురాతన శ్రీ శ్రీనివాస పెరుమాళ్ దేవస్థానంలో ప్రత్యేక పూజలను లోక సంక్షేమార్థం నిర్వహించారు.

విక్రవాండి ఉప ఎన్నిక బహిష్కరణ

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూన్ 15: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి జూలై 10న నిర్వహించనున్న ఉప ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. విక్రవాండి నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే పుహళేంది గత ఏప్రిల్ 6న అనారోగ్యం కారణంగా మరణించడంతో ఆ నియోజకవర్గం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నియోజకవర్గానికి వచ్చే నెల 10వ తేది ఉప ఎన్నికల జరుగుతుందని ప్రకటించి నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. దీంతో రాజకీయపార్టీలు ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను ఎంపిక చేసే పనులు చేపట్టాయి. ఆ రీతిలో డీఎంకే అభ్యర్థిగా అన్నియూర్ శివ, పీఎంకే అభ్యర్థిగా సి.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా డా.అభినయ పేర్లను ప్రకటించాయి. ఈ నేపథ్యంలో రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో శనివారం మధ్యాహ్నం పళనిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు కేపీ మునుస్వామి, కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, మాజీ మంత్రులు తంగమణి, డి.జయకుమార్, ఎస్పీ వేలుమణి, వలర్మతి, సెమ్మలై, నత్తం విశ్వనాధన్, సీవీ షణ్ముగం సహా అన్ని జిల్లాల పార్టీ కార్యదర్శులు, ముఖ్య నిర్వాహకులు పాల్గొన్నారు. సుమారు గంటన్నర జరిగిన ఈ సమావేశంలో విక్రవాండి ఉప ఎన్నికను బహిష్కరించాలని తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా పళనిస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడున్నరేళ్లుగా డీఎంకే అరాచక పాలన కొనసాగిస్తోందని, అందువల్ల విక్రవాండి ఉప ఎన్నికను తమ పార్టీ బహిష్కరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అన్యాయాలు జరుగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదని, స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా విక్రవాండి ఉప ఎన్నిక జరిగే అవకాశం లేనందువల్లే తాము బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్లు పళనిస్వామి తెలిపారు.

ఇసుక స్మగ్లింగ్‌ను అడ్డుకున్న ఆర్డీవోపై హత్యాయత్నం

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా అన్నవాసల్ సమీపంలో ఇసుక అక్రమరవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆర్డీవోను లారీ ఎక్కించి హతమార్చేందుకు ప్రయత్నించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నవాసల్ ప్రాంతం వద్ద ఇసుక స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ఇలుప్పూరు ఆర్డీవో దైవనాయకికి రహస్య సమాచారం అందింది. దీనితో అన్నవాసల్ సమీపంలోని ప్రాథమిక పాఠశాల వద్దకు కారులో సిబ్బందితో వెళ్ళి నిఘా వేశారు. ఆ సమయంలో ఇసుకలోడుతో వెళుతున్న మినీలారీని ఆపేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో లారీలో ఉన్న డ్రైవర్ శంకర్, అతడి సహాయకుడు సుందరం ఆగ్రహం చెంది ఆర్డీవో కారును ఢీకొట్టేందుకు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం నుండి తప్పించుకునేందుకు ఆర్డీవో కారు డ్రైవర్ దానిని పక్కకు మళ్ళించారు. అయినా మినీలారీలో ఉన్న దుండగులు కారును పక్కవాటుగా ఢీకొన్నారు. దీనితో దిగ్భ్రాంతి చెందిన ఆర్డీవో మినీ లారీని నిలిపి ఇద్దరినీ నిర్బంధించమంటూ సిబ్బందిని పురమాయించారు. కారులో నుండి ఆర్డీవో కార్యాలయం సిబ్బంది దిగటాన్ని చూసిన మినీలారీ డ్రైవర్, సహాయకుడు లారీని అక్కడే విడిచిపెట్టి పారిపోయారు. పోలీసులు ఈ సంఘటనపై విచారణ జరిపి లారీ డ్రైవర్ శంకర్, సహాయకుడు సుందరంపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం మనదే

మంత్రి ఉదయనిధి స్టాలిన్

అడయార్, జూన్ 15: ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించినట్టుగానే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామని రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ జోస్యం చెప్పారు. తిరుపూరు జిల్లా మంగలంలో జరిగిన కలైంజర్ శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కలైంజర్ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రతి నియోజకవర్గంలో కలైంజర్ పేరుతో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం విజయాన్ని ప్రజలు అందించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నెరవేర్చుతున్నారని గట్టిగా భావించడం వల్లే అమోఘమైన విజయాన్ని అందించారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే తరహాలో విజయం సాధిస్తామని ఆయన జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం విజయాన్ని అందించిన ఓటర్లకు, సీఎం స్టాలిన్‌కు, కలైంజర్ శతజయంతి ముగింపు వేడుకలను ఒకే వేదికగా శనివారం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

సమాచార ద్వని

పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 15: పద్మ పురస్కారాలకు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, ఇంజనీరింగ్, కేంద్ర ప్రభుత్వ పనులు, వ్యాపారం, వృత్తుల శాఖల్లో రాణించిన, ఉత్తమ సేవలందించిన వారికి వచ్చే ఏడాది జనవరి 26వ తేది గణతంత్ర దినోత్సవం రోజున ఈ పురస్కారాలు అందజేయనున్నారు. అర్హులైన వారు awards.gov.in, padmaawards.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 7401703480 నెంబరులో సంప్రదించవచ్చు.

రిజిస్ట్రేషన్ రోజే పట్టా పేరు మార్పు

ఐసిఎఫ్, జూన్ 15: రిజిస్ట్రేషన్ ముగిసిన కొన్ని గంటల్లోనే పట్టాలో ఆటోమేటిక్ విధానంలో పేరు మార్పు చేయడం అమల్లోకి వచ్చింది. ఈ సౌకర్యాన్ని రెవెన్యూ శాఖ వెబ్‌సైట్ ద్వారా కల్పించారు. ఆస్తుల యజమానులు అందజేసే ధ్రువీకరణ పత్రాలు, మొబైల్ నెంబర్లు సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. కొన్నేళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న పాత విధానాన్ని తొలగిస్తూ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టామని,ఈ విధానం శనివారం అమల్లోకి వచ్చిందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలిపారు.

గ్రంథ రచనలకు ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 15: ఉత్తమ గ్రంథ రచనలను ఆగస్టు 30వ తేదీలోపు పంపించాలని తమిళ అభివృద్ధి శాఖ తెలియజేసింది. చిన్న కథలు, కవిత్వం, నాటకం, బాలసాహిత్యం, నైపుణ్యం, సూక్ష్మ కళలు, నిఘంటువు సహా 33 శీర్షికల్లో ఉత్తమ గ్రంథ రచన చేసే వారిని ఎంపిక చేసి, వారికి నగదు బహుమతి, సర్టిఫికెట్లను తమిళ అభివృద్ధి శాఖ అందజేయనుంది. రచయితలు, పబ్లిషర్లు 2023లో రాసిన, ప్రచురించిన పుస్తకాలు ఐదు కాపీలు, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో స్థానిక ఎగ్మూర్‌లోని తమిళ అభివృద్ధి శాఖ కార్యాలయానికి పంపించాలి. ఇతర వివరాలకు 044-28190412 అనే నెంబరును సంప్రదించవచ్చు.

సెప్టెంబరు 14 వరకు ఆధార్ రెన్యువల్ గడువు

ఐసిఎఫ్, జూన్ 15: ఆధార్ రెన్యువల్ గడువు సెప్టెంబరు 14వ తేది వరకు అధికారులు పొడిగించారు. నిబంధనల ప్రకారం ఆధార్ నమోదుచేసుకున్న రోజు నుంచి మరో పదేళ్ల వరకు గుర్తింపుకార్డు, అందులో పేర్కొన్న చిరునామాలను ప్రభుత్వ సేవా కేంద్రాల్లో రూ.50 చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలి. ఆధార్ అధికారపూర్వక వెబ్‌సైట్‌లో ప్రస్తుతం ఉచితంగా రెన్యువల్ చేసుకొనేందుకు ప్రభుత్వం సెప్టెంబరు 14వ తేది వరకు అవకాశం కల్పించింది. ఇతర వివరాలకు uidai.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

ప్రభుత్వ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 15: ప్రభుత్వ పురస్కారానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగుల సంక్షేమం కోసం కృషిచేసిన, ఉత్తమ సేవలందించిన కలెక్టర్, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, సోషల్ వర్కర్లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, దివ్యాంగులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించిన సంస్థలు అని ఆరు రకాల పురస్కారాలను స్వాతంత్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి అందజేయనున్నారు. అర్హులైన వారు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో జూలై 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి.

వెటర్నరీ కోర్సులకు 11,000 దరఖాస్తులు

ఐసిఎఫ్, జూన్ 15: వెటర్నరీ కోర్సులకు 11,000 దరఖాస్తులు అందాయి. తమిళనాడు వెటర్నరీ సైన్స్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో బీవీఎస్సీ-ఏహెచ్, బీటెక్ కోర్సులకు విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. విద్యార్థులు https://adm.tanuvas.ac.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 21వ తేది సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవాస భారతీయులు జూలై 5వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్లస్ టూ మార్కుల ఆధారంగా జరుగుతున్న అడ్మిషన్లకు ఇప్పటివరకు బీవీఎస్సీ-ఏహెచ్ కోర్సుకు 9,100, బీటెక్ కోర్సులకు 1,900 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వర్సిటీ వెల్లడించింది.

23న డాగ్ షో

ఐసిఎఫ్, జూన్ 15: కోయంబత్తూర్ మాంచెస్టర్ కెనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేది కోవై నవ ఇండియా, హిందుస్తాన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఛాంపియన్‌షిప్ డాగ్ షో జరుగనుంది. 11 టైటిళ్లలో పోటీలు నిర్వహించనున్నారు. అన్ని ఒరిజినల్ బ్రీడ్స్‌తో పోటీల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. కన్ని, కోంబై, సిప్పిపారై, నాటు కుక్కలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నారు. టైటిల్ గెల్చుకొనే డాగ్స్ మాత్రమే కాకుండా బెస్ట్ పప్పి, ఇండియన్ బ్రీడ్, బెస్ట్ జూనియర్, బెస్ట్ హ్యాండర్, జూనియర్ హ్యాండర్ వంటి అవార్డులు అందజేస్తారు. వివరాలకు 9843079767, 9585266566 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, జూన్ 15: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30వ తేదిలోపు ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుందని ఇంజనీరింగ్ కౌన్సిల్ కమిటీ తెలిపింది. అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉన్న 450కి పైగా ఇంజనీరింగ్ కళాశాల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో చేరేందుకు కౌన్సిలింగ్ జరుగనుంది. ఈ ఏడాది కౌన్సెలింగ్‌కు 2.09 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 1.94 లక్షల మంది సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేశారు. వీరికి ఈ నెలాఖరులోపు సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుంది.కాల్‌లెటర్‌తో తల్లిదండ్రులు కౌన్సిలింగ్ సహాయ కేంద్రానికి రావాలని, ఇతరులు అవసరం లేదని ఇంజనీరింగ్ కౌన్సిల్ కమిటీ తెలిపింది.

బీసీ, ఎంబీసీ హాస్టళ్లలో చేరేందుకు ఆహ్వానం

పెరంబూర్, జూన్ 15: బీసీ, ఎంబీసీ హాస్టళ్లలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై జిల్లా పరిధిలో 11 పురుషులు, 6 మహిళలు అని 17 హాస్టల్స్ పని చేస్తున్నాయి. వార్షికాదాయం రూ.2 లక్షల లోపుండి, 8 కి.మీ దూరానికి పైగా కళాశాలలున్న వారు ఈ హాస్టల్స్‌లో చేరవచ్చు. భోజనం, బస వసతి ఉచితంగా కల్పించనున్నారు. కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ హాస్టల్‌లో చేరేందుకు జూలై 15వ తేదిలోపు చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖలో తగిన సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

28న మాజీ సైనికుల గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 15: మాజీ సైనికుల సమస్యల పరిష్కార శిబిరం ఈ నెల 28వ తేది జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... స్థానిక హార్బర్ సమీపంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న ఈ గ్రీవెన్స్‌లో కలెక్టర్ పాల్గొని వినతిపత్రాలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, కుటుంబసభ్యులు తగిన గుర్తింపుకార్డుతో పాల్గొని తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న విరుదునగర్ కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్, టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి, చెన్నై కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధీరవియం తదితరులు



ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించిన ఆరోగ్యశాఖ అధికారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఊటీ కొండ రైలుకు 125 వసంతాలు పూర్తి

ఐసిఎఫ్, జూన్ 15: నీలగిరి కొండ రైలు 125 వసంతాలు పూర్తిచేసుకుంది. ఈ రైలు సేవలు 1899 జూన్ 15వ తేది మేట్టుపాళయం నుంచి కున్నూర్‌కు ప్రారంభమయ్యాయి. ఈ రైలును రూపొందించడానికి కారకులైన బ్రిటీష్ పర్యవేక్షణ ఇంజనీర్ జెఎల్‌ఎల్ మోరంట్‌ను స్మరించుకొనేలా శనివారం 125వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... జెఎల్‌ఎల్ మోరంట్ ప్రపంచవ్యాప్తంగా రైళ్లు నడిపేందుకు కారణమైన రిగన్‌బాగ్ అనే వ్యక్తిని నీలగిరికి తీసుకొచ్చి ఈ రైలు తయారు చేయించారని, అయితే నిధుల కొరత కారణంగా ఈ పనులు ఆగిపోయాయని తెలిపారు. మళ్లీ రిగన్‌బాగ్ సహాయకుడు రోమన్‌అఫ్ట్ పనులు పూర్తిచేశారని తెలిపారు. అలాగే, కున్నూర్‌లో ఉన్న రోమన్ క్యాథలిక్ చర్చి, వెల్లింగ్టన్ దేవాలయం, కూడలూరు ప్రొటెస్టెంట్ చర్చి, లారెన్స్ పాఠశాల, ఊటీ బొటానికల్ పార్క్ వంటివి కూడా మోరంట్ నిర్మించారని పేర్కొన్నారు. 1886 జూన్ 17వ తేది ఆస్ట్రేలియాలో మృతిచెందిన మోరంట్ చిత్రపటం లభించకపోవడం దురదృష్టకరమన్నారు. అయినప్పటికీ, ఆయన పేరుతో ప్రతి ఏటా నీలగిరి కొండ రైలు వార్షిక వేడుకలు జరుపుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.



మొదటి ఊటీ కొండ రైలు

తొలిసారిగా దివ్యాంగురాలి అవయవదానం

ఐసిఎఫ్, జూన్ 15: రాష్ట్రంలో తొలిసారిగా ఓ దివ్యాంగురాలు అవయవాలను దానంగా స్వీకరించారు. తిరునల్వేలి కుల వనిగర్‌కుళంకు చెందిన అరసమ్మాళ్ (59) ఈనెల 10వ తేది తాళైయూత్తు ప్రాంతంలో ద్విచక్రవాహనంలో వస్తూ అదుపుతప్పి కిందపడడంతో బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారు. ఆమె కుటుంబసభ్యుల అనుమతితో తిరునల్వేలి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో శస్త్రచికిత్స ద్వారా కాలేయం, చర్మం, కళ్లు దానంగా పొందారు. వాటిని వెంటనే వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. ఆమె అంత్యక్రియలకు హాజరైన ఆసుపత్రి డీన్ రేవతిబాలన్ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది ఆమెకు గౌరవ వందనం చేశారు.



అరసమ్మాళ్ భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

జూలై 20న రేషన్ దుకాణాలకు సెలవు

ప్యారీస్, జూన్ 15: రాష్ట్రవ్యాప్తంగా జూలై 20వ తేది రేషన్ దుకాణాలు పనిచేయవని పౌరసరఫరాల శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. గత సెప్టెంబరు నెలలో రాష్ట్రవ్యాప్తంగా గృహిణులకు నెలకు రూ.1,000 పంపిణీ చేసే 'కలైంజర్ మగళీర్ ఉరుమై తొగై' పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకం కోసం గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ దుకాణాల్లో ప్రత్యేక శిబిరాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, వారి వివరాల నమోదు పనులు జరిగాయి. ఈ పనుల కారణంగా గత ఏడాది సెలవు రోజులైన జూలై 23, ఆగస్టు 4వ తేదీల్లో రేషన్ దుకాణాలు పనిచేశాయి. ఆ రెండు రోజులకు సంబంధించి జూన్ 15వ తేది అయిన శనివారం, వచ్చే జూలై 20వ తేదీల్లో రేషన్ దుకాణాలు పనిచేయవని ప్రకటించారు.

జీటీఆర్ హయ్యర్ సెకండరీ స్కూల్‌కు ఈక్యూ ఇండియా చేయూత

అడయార్, జూన్ 15: రాష్ట్రంలోని హొసనూరులో ఉన్న జీటీఆర్ హయ్యర్ సెకండరీ స్కూల్ కు చేయూత ఇచ్చేందుకు ఈ క్యూ ఇండియా ముందుకు వచ్చింది. యూకేలో అతిపెద్దదిగా ను, యూఎస్‌లో రెండో అతిపెద్ద షేర్ రిజిస్ట్రార్ గ్లోబల్ కాంపిటెన్స్ సెంటర్‌గా గుర్తింపు పొందిన ఈక్యూ ఇండియా ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించనుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఈ పాఠశాలలో వివిధ మౌలిక సదుపాయాలను కల్పించనుంది.ఇదేవిషయంపై జీటీఆర్ హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.బాలకృష్ణన్ మాట్లాడుతూ, సీఎస్ఆర్ ప్రోగ్రామ్ కింద ఈక్యూ ఇండియా తమ స్కూల్‌ను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ మౌలికసదుపాయాల రూపకల్పనలో భాగంగా తరగతి గదుల పైకప్పు నిర్మాణం, తరగతి గదుల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు తాంబరం-నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, జూన్ 15: స్థానిక తాంబరం-నాగర్‌కోయిల్ మధ్య ఆదివారం ప్రత్యేక రైలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. తాంబరం నుంచి రాత్రి 10.20 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 11 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నాగర్‌కోయిల్ నుంచి 17వ తేది మధ్యాహ్నం 1.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3 గంటలకు తాంబరం చేరుతుందని అధికారులు తెలిపారు.

పోలీసుల కోసం లివర్ స్క్రీన్ క్యాంపు

అడయార్, జూన్ 15: నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రు ల్లో ఒకటైన గ్లెనెగ్లెస్ హెల్త్‌సిటీ లో పోలీసుల కోసం ప్రత్యేకంగా ఫిబ్రో స్కాన్ లివర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. మొత్తం మూడు రోజుల పాటు సాగే ఈ శిబిరాన్ని తాంబరం పోలీస్ కమిషనరేట్ అడిషనల్ కమిషనర్ (హెడ్ క్వార్టర్, ట్రాఫిక్) సి.మహేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిటీ హెపటాలజీ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ డైరెక్టర్ డాక్టర్ జాయ్ వర్గీస్, హాస్పిటల్ సీఈవో డాక్టర్ నగేష్ పాల్గొన్నారు. కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, కాలేయ వ్యాధులను ముందుగానే గుర్తించడం లక్ష్యంగా ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించినట్టు డాక్టర్ నగేష్ కె.రావు వెల్లడించారు. తొలి రోజున దాదాపు 300 మంది పోలీసులు హాజరై పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు.

పన్ను చెల్లించని 100 మందికి నోటీసులు

ప్యారీస్, జూన్ 15: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కు సక్రమంగా పన్ను చెల్లించని 100 మందికి వివరణ కోరుతూ నోటీసులు జారీ అయ్యాయి. జీసీసీకి సంబంధించిన ప్రధాన ఆదాయంలో ఆస్తులు, వాణిజ్య పన్నులు కీలకం. ఏడాదికి సుమారు 13 లక్షల మంది ఆస్తుల యజమానుల నుంచి రూ.1,800 కోట్లకు పైగా పన్ను వసూలుచేస్తున్నారు. సంవత్సరాల తరబడి పన్ను చెల్లించని సంస్థల నుంచి పన్ను వసూలుచేసే చర్యలను జీసీసీ అధికారులు ముమ్మరం చేశారు. ఆ మేరకు గత మే 31వ తేది వరకు రూ.22.44 కోట్లు పన్ను చెల్లించని 100 మంది జాబితా తయారుచేసి, వారికి నోటీసులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు.

పేదలకు అన్నదానం

వేలూరు, జూన్ 15: పునిత అన్నై థెరిస్సా మనిదనేయ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు జయప్రద శనివారం జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాట్పాడి సమీపంలో రోడ్డుపక్కనున్న పేదలకు మిఠాలు, బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు విజయబాను నేతృత్వంలో ట్రస్ట్ సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొంటుందని ఈ సందర్భంగా జయప్రద తెలిపారు.

కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘన కేసు

డీజీపీకి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూన్ 15: కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసులో అఫిడవిట్ దాఖలుచేయాలని డీజీపీ శంకర్ జివాల్‌కు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. తూత్తుకుడి సిలువైపట్టికి చెందిన మాడస్వామి, తాళముత్తు నగర పోలీస్‌స్టేషన్‌లోని రౌడీల జాబితా నుంచి తన పేరు తొలగించాలని కోరుతూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి, పిటిషన్‌దారుడి పేరును రౌడీల జాబితా నుంచి తొలగించాలి. రౌడీల జాబితా పర్యవేక్షణ, పేర్ల తొలగింపుకు సంబంధించి జిల్లాల వారీగా కమిటీ ఏర్పాటుచేసి విచారణ చేపట్టాలి. రౌడీల జాబితాలో కంప్యూటర్‌లో నమోదుచేయాలి. ఈ విషయమై జిల్లా ఎస్పీలకు డీజీపీ సర్క్యులర్ జారీచేయాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఈ ఉత్తర్వులు అమలుచేయని డీజీపీ శంకర్ జివాల్‌పై కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘన చర్యలు చేపట్టాలని కోరుతూ మాడస్వామి, హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి శేషసాయి, కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసుపై డీజీపీ శంకర్ జివాల్ అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదావేశారు.

విక్రవాండి పీఎంకే అభ్యర్థి అన్బుమణి

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పీఎంకే తరఫున సి. అన్బుమణి పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. అన్బుమణి ప్రస్తుతం పీఎంకే ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గత 2016లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆయన ఈ నియోజకవర్గంలోనే పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో పీఎంకే ఏ పార్టీలతో పొత్తు లేకుండా పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి రాధామణి 63,757 ఓట్లు పొంది గెలిచారు. సి. అన్బుమణికి 41,428 ఓట్లు మాత్రమే లభించాయి.



రాందాస్‌ను కలుసుకుని ఆశీస్సులు పొందిన అన్బుమణి

ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూలులో ఖగోళశాస్త్రంపై ప్రదర్శన ప్రారంభం



ఖగోళ శాస్త్ర ప్రదర్శనలో పాల్గొన్న స్కూలు నిర్వాహకులు, విద్యార్థులు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పళ్ళికరణై బెల్‌నగర్‌లోని ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూలులో 'గో కాస్మో యువర్ టికెట్ స్పేస్' పేరుతో మూడు రోజుల ఖగోళ శాస్త్ర ప్రదర్శన అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఖగోళ శాస్త్ర విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ అజిత్‌సింగ్ ప్రారంభించారు. స్కూలు అకడమిక్స్ ఉపాధ్యక్షులు డాక్టర్ అన్నా మరియా నొరోన్హా పళ్ళికరణై స్కూలు ప్రిన్సిపాల్ రజిని చార్లెస్, ఆర్కిడ్స్ అకడమిక్స్ స్టూడెంట్ వెల్ఫేర్ ఉపాధ్యక్షులు హరీష్ గుప్తా, ఆర్కిడ్స్ చెన్నై జోనల్‌హెడ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో ఖగోళశాస్త్రవేత్తలకు కలిగే అనుభవాలు, అంతరిక్షంలోని వింతలు విశేషాలను విద్యార్థులు సులువుగా తెలుసుకునేలా సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఏయే గ్రహాలలో ఎంత బరువును కలిగి ఉంటారో తెలిపేలా ప్రత్యేక తూనిక పరికరం కూడా సిద్ధం చేశారు. వ్యోమగాములు అంతరిక్షయాత్ర విశేషాలను విద్యార్థులకు కళ్ళకుగట్టినట్లు ప్రదర్శింపజేశారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

వేలూరు, జూన్ 15: కేవీ కుప్పం డివిజన్ మేల్‌మాయిల్ గ్రామంలో ఉన్న ద్రౌపది అమ్మ న్ ఆలయ అగ్నిగుండ ప్రవేశం వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా కాపు కట్టుట, ధ్వజారోహణం నిర్వహించారు. మహాభారతంలోని అర్జున తపస్సు, దుర్యోధనుడి వధ తదితర దృశ్యాలను కళాకారులు ప్రదర్శించారు. అనంతరం వ్రతమాచరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

రేషన్ రసీదులో ప్రభుత్వ సబ్సిడీ వివరాలు

ఐసిఎఫ్, జూన్ 15: రేషన్ దుకాణాల్లో వస్తువులు విక్రయించేటప్పుడు అందజేసిన రసీదుల్లో ఒక్కో వస్తువుకు ప్రభుత్వ సబ్సిడీ ఎంత అనే వివరాలను ఆహార శాఖ పేర్కొంటుంది. కార్డుదారులకు బియ్యం, గోధుమలు ఉచితంగా, చక్కెర, పామాయిల్, కందిపప్పు సబ్సిడీ ధరకు అందజేస్తున్నారు. బియ్యం, గోధుమలను భారత ఆహార సంస్థ నుంచి తక్కువ ధరకు, ఇతర వస్తువులు మార్కెట్ ధరకు ఆహార శాఖ కొనుగోలు చేస్తోంది. ఆహార సబ్సిడీ కోసం మాత్రమే ప్రభుత్వం సంవత్సరానికి రూ.10,500 కోట్లు వ్యయం చేస్తోంది. ఈ నేపథ్యంలో, ఆహార వస్తువులు విక్రయించే సమయంలో అందజేసే రసీదులో రేషన్‌కార్డు నెంబరు, వినియోగదారుల పేరు, వస్తువుల కొలతలు వంటివి తెలియజేస్తుండగా, ప్రస్తుతం ఒక్కో వస్తువుకు ప్రభుత్వం కేటాయించే రాయితీ వివరాలు కూడా ముద్రించి అందజేయనున్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

వేలూరు, జూన్ 16: గుడియాత్తం సమీపం సైనగుంట చెక్‌పోస్టులో శనివారం ఇన్‌స్పెక్టర్ శాంతి నేతృత్వంలో పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. అటుగా అస్సాం రాష్ట్రానికి చెందిన మంగళాయాజ్‌ను అదుపులోకి తీసుకొని, అతని బ్యాగు పరిశీలించి నాలుగు కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిరాయి ముఠాకు చెందిన 12 మంది అరెస్ట్

ప్యారీస్, జూన్ 15: నగరంలో మారణాయుధాలతో సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన కిరాయి ముఠాకు చెందిన 12 మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు. స్థానిక అరుంబాక్కంలో కిరాయి ముఠా నాయకుడు రాధ అనుచరులు పల్లావరం మోర్విన్, నాయిమణి, తమీమ్, అజిత్, మదన్, సతీష్, సురేంద్రన్, అబ్దుల్ సహా 12 మంది అరాచకాలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారంతో శనివారం పోలీసులు వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకొని ఐదు కత్తులు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... కోయంబేడుకు చెందిన న్యాయవాది, ఓ రౌడీ అనుచరుడిని పాతకక్షల కారణంగా హత్యచేయాలని ఈ ముఠా వ్యూహం పన్నిన విషయం తెలిసింది.

రూ.100 కోట్ల ఆస్తి మోసం కేసు

సీబీసీఐడీకి బదిలీ

అడయార్, జూన్ 15: అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి విజయభాస్కర్ రూ.100 కోట్ల విలువ చేసే ఆస్తిని కైవసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వచ్చిన ఆరోపణల కేసులో లోతుగా దర్యాప్తు చేసేందుకు వీలుగా సీబీసీఐడీకి బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ శంకర్ జీవాల్ ఆదేశించారు. కరూర్ జిల్లా వాంగల్‌కుప్పిచ్చిపాళెయం ప్రాంతానికి చెందిన ప్రకాష్ అనే వ్యాపారవేత్త స్థానిక కరూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదు చేశారు. తాను ఒక ఎలక్ట్రిక్ షాపును నడుపుకుంటున్నానని, తనకు తోరణక్కల్ పట్టి, కున్నంపట్టిలలో ఉన్న 100 కోట్ల విలువ చేసే 22 ఎకరాల స్థలాన్ని అన్నాడీఎంకే మాజీ మంత్రి విజయభాస్కర్ తన సొంతం చేసుకునేందుకు యత్నిస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు విచారణను కరూర్ సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారిస్తున్నారు. తాజాగా ఈ కేసు విచారణను సీబీసీఐడీకి బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ శంకర్ జీవాల్ ఆదేశాలు జారీచేశారు.

నెల్లై సీపీఎం కార్యాలయంపై దాడి

13 మంది అరెస్ట్

ప్యారీస్, జూన్ 15: తిరునల్వేలి జిల్లా రెడ్డిపట్టిలో ఉన్న సీపీఎం కార్యాలయంపై దాడిచేసి విధ్వంసానికి పాల్పడిన 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పాళయంకోట నంబిక్కైనగర్‌కు చెందిన మదన్‌కుమార్ (28) అనే దళిత యువకుడు పెరుమాళ్‌పురానికి చెందిన వేరే కులానికి చెందిన ఉదయ ద్రాక్షాయణి (23)ను ప్రేమించుకున్నారు. వారి వివాహానికి వధువు కుటుంబీల నుంచి వ్యతిరేకత రావడంతో స్థానిక సీపీఎం నాయకులను ఆశ్రయించి తమకు వివాహం జరిపించాల్సిందిగా అభ్యర్థించారు. దీంతో రెడ్డిపట్టిలో ఉన్న సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మదన్‌కుమార్-ఉదయద్రాక్షాయణిలకు కులాంతర వివాహం జరిపి కామ్రేడ్లు వారిని ఆశీర్వదించారు. ఈ విషయం తెలుసుకున్న వధువు తల్లిదండ్రులు, బంధువులు సీపీఎం కార్యాలయంలో చొరబడి కిటికీ అద్దాలు, ఫర్నిచర్ తదితరాలను ధ్వంసం చేశారు. ద్రాక్షాయణిని తమతో పంపించాలని కామ్రేడ్లతో వాగ్వాదానికి దిగగా వారు అభ్యంతరం తెలిపారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడ్డారు. దీనిపై సీపీఎం నిర్వాహకులు అందజేసిన ఫిర్యాదు మేరకు ద్రాక్షయణి తల్లిదండ్రులు సహా 13 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఇదిలా ఉండగా, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో సహా పలువురు నేతలు ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో పరువు హత్యలు కొనసాగుతుండడంపై వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విక్రవాండి ఉప ఎన్నికలో డీఎంకే మద్దతుగా ప్రచారం : సీపీఐ

ప్యారీస్, జూన్ 15: విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివకు మద్దతుగా తమ పార్టీ తరపున ప్రచారం చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ పేర్కొన్నారు. ఈరోడ్ జిల్లా సత్యమంగళంలో ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ... కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన తమిళుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం రూ.5 లక్షలు పంపిణీ చేసిందని, అయితే కేంద్రప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల పరిహారాన్ని రూ.25 లక్షలుగా పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరపాలని, రాష్ట్రంలో ఈ పరీక్షను శాశ్వతంగా నిషేధించాలని కోరారు. అటవీ శాఖలో పనిచేస్తున్న రక్షణ విభాగం సిబ్బందిని, కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులను పర్మినెంట్ చేయాలన్నారు.

తమిళిసై గురించి అనుచిత వ్యాఖ్య

డీఎంకే నేత శివాజి కృష్ణమూర్తిపై కేసు పెడతా : నటి ఖుష్బూ

ప్యారీస్, జూన్ 15: బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్‌పై అనుచితవ్యాఖ్యలు చేసిన డీఎంకే ప్రచారకర్త శివాజి కృష్ణమూర్తిపై కేసు పెట్టనున్నట్లు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, నటి ఖుష్బూ పేర్కొన్నారు. ఆమె శనివారం విడుదల చేసిన ప్రకటనలో... గత సంవత్సరం జరిగిన డీఎంకే బహిరంగ సభలో మాట్లాడిన శివాజి కృష్ణమూర్తి, రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి, తన గురించి అసభ్యంగా దూషించారని అందజేసిన ఫిర్యాదుమేరకు ఆయనను పార్టీ సభ్యత్వం నుంచి తొలగించి అరెస్ట్ చేసి జైలుకు తరలించారని తెలిపారు. ఈ నేపథ్యంలో, కాంచీపురంలో ఏప్రిల్ 15వ తేది జరిగిన డీఎంకే ప్రచార సభలో పాల్గొన్న శివాజి కృష్ణమూర్తి, తమిళిసై గౌరవ ప్రతిష్ఠలు దెబ్బతీసేలా మాట్లాడారని, ఈ వ్యవహారంలో ఆయనపై పరువు నష్టం దావా వేయనున్నట్లు ఖుష్బూ ప్రకటనలో తెలిపారు.

చెన్నైలో ఏఐసీసీ చీఫ్ ఖర్గే

అడయార్, జూన్ 15: అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం చెన్నై నగరానికి వచ్చారు. ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువును చూసేందుకు ఆయన వచ్చారు. ఆయనకు చెన్నై విమానాశ్రయంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగైతో పాటు మరికొందరు సీనియర్ నేతలు, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వచ్చారు. ఆ తర్వాత శనివారం సాయంత్రం 4.30 గంటలకు మళ్ళీ చెన్నై నుంచి బెంగుళూరుకు ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్ళారు.

ప్రభుత్వ బస్సుల్లో నగదురహిత పరివర్తన

ఐసిఎఫ్, జూన్ 15: ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 100 శాతం నగదురహిత పరివర్తన అందుబాటులోకి వచ్చినట్లు రవాణా సంస్థ అధికారులు తెలిపారు. గూగుల్ పే, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా టిక్కెట్టు పొందే సౌకర్యాన్ని గత మేలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విషయమై రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ... అత్యాధునిక టిక్కెట్టు పరికరాల ద్వారా నగదురహిత పరివర్తన అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా ప్రయాణిస్తున్నారని, చిల్లర సమస్య కూడా లేదని తెలిపారు.

ధర్మపురిలో గుట్కా బస్తాల స్వాధీనం

- ఒకరి అరెస్టు



చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా కారిమంగళంలో బెంగళూరు నుండి సేలంకు టెంపోలో అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షల విలువైన గుట్కావస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కర్ణాటకకు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. కారిమంగళం పోలీసులు జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ చేస్తుండగా వేగంగా వెళుతున్న టెంపోవ్యాన్‌ను నిలిపేందుకు ప్రయత్నించారు. పోలీసులను చూడగానే వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు వ్యాన్‌ను అక్కడే నిలిపి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఆ ఇరువురిలో ఒకరిని నిర్బంధించారు. పోలీసులు జరిపిన విచారణలో ఆ వ్యక్తి మైసూరు జిల్లా కేతమరాన్‌హళ్ళి ప్రాంతానికి చెందినవాడని తెలుసుకున్నారు. ఇక ఆ టెంపో వ్యాన్‌లో పోలీసులు తనిఖీలు చేసినప్పుడు 69 ప్లాస్టిక్ బస్తాలలో దాచిన 760 కేజీల బరువు గల నిషేధిత గుట్కా వస్తువులు లభించాయి. ఆ గుట్కా వస్తువుల విలువ సుమారు ఐదు లక్షల రూపాయలని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మైసూరు జిల్లాకు చెందిన శశాంక్ అనే వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఊటీకి త్వరలో కార్పొరేషన్ హోదా

ప్యారీస్, జూన్ 15: నీలగిరి జిల్లాలో క్వీన్ ఆఫ్ హిల్స్‌గా ప్రసిద్ధిచెందిన ఊటీకి త్వరలో కార్పొరేషన్‌గా హోదా పెరగనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం చెన్నై, మదురై, కోవై, సేలం, తిరుచ్చి, తిరునల్వేలి, తిరుప్పూర్, ఈరోడ్, వేలూరు సహా 25కార్పొరేషన్లున్నాయి. ఇవికాకుండా, తూత్తుకుడి,దిండుగల్, హోసూరు, నాగర్‌కోయిల్, ఆవడి, కడలూరు, కాంచీపురం, కరూర్, శివకాశి, తాంబరం, కుంభకోణం, కారైక్కుడి, నామక్కల్, పుదుకోట, తిరువణ్ణామలై అనే కార్పొరేషన్లు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇదిలా ఉండగా, ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన ఊటీని కార్పొరేషన్‌గా స్థాయి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1818లో అప్పటి కోవై జిల్లా కలెక్టర్ జాన్‌సలివన్ ఊటీ ప్రాంతాన్ని ఎంపిక చేసి తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంతం సముద్రమట్టానికి 7,347 అడుగుల ఎత్తులో ఉన్నందున, చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకుంది. 2014లో జరిగిన జనగణన ప్రకారం ఇక్కడ 88,430 మంది నివసిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య రెండింతలు పెరిగిన కారణంగా 30.36 చ.కి.మీ విస్తీర్ణంలో 36 వార్డులతో మున్సిపాలిటీగా ఉన్న ఊటీకి అదనపు నిధులు కేటాయించి త్వరలోనే కార్పొరేషన్‌గా ప్రకటించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని స్థానిక సంస్థల అధికారులు తెలిపారు.

ఆంధ్రాకు వలసపోతాం

- పరందూర్ ప్రజల హెచ్చరిక

పెరంబూర్, జూన్ 15: పరందూర్ విమానాశ్రయానికి వ్యతిరేకంగా పరందూర్, ఏకనాపురం గ్రామాల ప్రజలు రాష్ట్రాన్ని విడిచి ఆంధ్ర రాష్ట్రానికి వలస పోవాలని నిర్ణయించినట్లు పోరాట కమిటీ హెచ్చరించింది. చెన్నై రెండవ విమానాశ్రయం, కాంచీపురం, పరందూర్ ప్రాంతాల్లో ఏర్పాటుకానుంది. ఇందుకోసం పరందూర్ సహా చుట్టుపక్కల గ్రామాల్లో 5,400 ఎకరాల అవసరమవుతుండగా, అందులో 3,750 ఎకరాలు ప్రైవేటుకు సొంతమైనవి కాగా, మిగిలినవి ప్రభుత్వానికి చెందినవి. విమానాశ్రయ ఏర్పాటుకు కావలసిన భూసేకరణ పనులను అధికారులు ప్రారంభించారు. కొత్త విమానాశ్రయానికి వ్యతిరేకం తెలుపుతూ మదుమంగళం సమీపం ఏకనాపురంలో కొన్నేళ్లుగా బాధిత గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపట్టారు. స్పందించని ప్రభుత్వం భూసేకరణ పనులు ముమ్మరం చేయడంతో, రాష్ట్రాన్ని విడిచి వెళ్లాలని పరందూర్, ఏకనాపురం గ్రామస్తులు నిర్ణయించారు. ఈ విషయమై పోరాట కమిటీ సభ్యులు మాట్లాడుతూ అన్నదాతల వేదన పట్టించుకోని ఈ ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్రాన్ని విడిచివెళ్లనున్నామన్నారు. ఆంధ్ర రాష్ట్రం వైపు ఈ నెల 24న కన్నీటి ప్రయాణం చేపట్టి, ఆ రోజున చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను కలుసుకోనున్నామని పోరాట కమిటీ సభ్యులు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధ్యమే...!

ప్రత్యేక పిల్లలు అంటేనే అరుపులు, కేకలు, ఏడుపులు తదితరాలతో కూడుకొని ఉంటారని అందరూ భావిస్తుంటారు. కానీ, ప్రస్తుతం అలాంటి ప్రత్యేక పిల్లలు పలు రంగాల్లో సాధారణ పిల్లల కంటే ధీటుగా రాణిస్తున్నారు. ఈత, సంగీతం, క్రీడలపై ఆసక్తి ఉన్న ప్రత్యేక పిల్లలు, వాటిపై దృష్టి సారించి, ఆయా రంగాల్లో విశేషంగా రాణిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో, మృదంగం, డోలక్ తదితర వాయిద్యపరికరాలను వాయిస్తున్నాడు నగరానికి చెందిన ప్రత్యేక, దివ్యాంగ యువకుడు శ్రీవెంకటేశన్.



పొందిన అవార్డులు, ప్రశంసాపత్రాలతో...

మృదంగంలో రాణిస్తున్న 'హైపర్ యాక్టివ్' దివ్యాంగ యువకుడు



మృదంగం వాయిస్తున్న శ్రీవెంకటేశన్

ఇటీవల అన్నైయార్ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన సంగీత కచ్చేరిలో మృదంగం వాయించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఎడమ కంట్లో కొద్దిగా చూపు మాత్రమే ఉండే 'హైపర్ ఆక్టివ్' యువకుడు శ్రీవెంకటేశన్ అద్భుత ప్రతిభకు నిదర్శనంగా నిలిచాడు. "రాజ్ భవన్' సంగీత కచేరిలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చింది. గవర్నర్ నన్ను ప్రత్యేకంగా అభినందించారు. నాతో పాటు అన్నయ్యలు చాలా మంది వివిధ వాద్యాలు వాయించగా, నేను మృదంగం, డోలక్ వాయించాను" అంటూ ఉత్సాహంగా చెబుతున్న శ్రీవెంకటేశన్ తల నిమిరిన తల్లి తమిళ్‌సెల్వి, అతని గురించి వివరించారు.

- పెరంబూర్

"నాకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడు శ్రీవెంకటేశన్, చిన్నవాడు కుమరన్. నా భర్త మణి, తిరుప్పూర్‌లోని బనియన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అందువల్ల ప్రస్తుతం మేము అక్కడే ఉంటున్నాము. శ్రీవెంకటేశన్‌ను కచ్చేరీకి పిలిస్తే నేను అతనిని తీసుకెళుతుంటాను. అలాగే, కొన్ని సమయాల్లో చెన్నైలోని అమ్మ వాళ్లింట్లో ఉంటాము. శ్రీవెంకటేశన్ పుట్టినప్పటి నుంచే అతనికి శారీరక సమస్యలున్నాయి. అప్పట్లో, కళ్లు తెల్లగా ఉన్నాయని చెప్పారు. అందువల్ల స్థానిక ఎగ్మూర్ పిల్లల సంక్షేమ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాము. కంట్లో పొర ఉందంటూ శస్త్రచికిత్స చేశారు. అయినా కంటి చూపు సరికా లేదు. అనంతరం పలు శస్త్రచికిత్సలు చేశారు. అలాగే, కోయంబత్తూర్‌లోని ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించాము. దాని తర్వాత చెన్నైలోని ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రిని సంప్రదించగా, వారు మరో శస్త్రచికిత్సలు చేశారు. కానీ, అది కూడా ఫైయింలైంది. మూడు నెలల అనంతరం కళ్లలో చీము చేరింది. దీంతో, కొన్ని నరాలు తొలగించారు. అప్పటి నుంచి కుడి కన్ను పూర్తిగా చూపు కోల్పోయింది. ఎడమ కన్ను మాత్రమే అది కొద్దిగా చూపు ఉంది. అది కూడా జీవితాంతం ఉంటుందని చెప్పలేమని వైద్యులు పేర్కొన్నారు. అదే సమయంలో హైపర్ ఆక్టివ్ పుట్టినప్పటి నుండి ఉంది. అందుకు మాత్రలు కూడా వాడేవారం. అందువల్ల అతనికి సాయంగా ఒకరు తప్పక ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత అదే ప్రాంతంలోని పిల్లల పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివాడు. అనంతరం కోట్టూరుపురంలో ఉన్న సెయింట్ లూయిస్ పాఠశాలలో చేర్పించాము. హైపర్ ఆక్టివ్ కారణంగా అతనిని కూర్చుచేలా పర్యవేక్షించలేమని పాఠశాల యాజమాన్యం పంపించి వేసింది. అనంతరం తిరుప్పూర్‌కు వచ్చేశాము. ప్రస్తుతం 19 ఏళ్ల వచ్చాయి" అన్నారు.

సంగీతమంటే ఇష్టం : శ్రీవెంకటేశన్

"సంగీతమంటే నాకు ఎంతో ఇష్టం. అందరూ పాట పాడుతుండగా వారితో పాటు నేను పాడుతుంటాను. మేడమ్‌తో కూడా కలసి పాడుతుంటాను. నేను మృదంగం, డోలక్ చక్కగా వాయిస్తాను. మృదంగంలో బాగా రాణించాలని నా ఆశ. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ఆన్‌లైన్ క్లాస్ ప్రారంభిస్తాను. అందువల్ల ఎక్కువ సేపు కూర్చోవడం కూడా అలవాటైంది. నాకు సొంతంగా మృదంగం లేకపోవడంతో ఘటంతోనే ఆన్‌లైన్ క్లాస్‌లో పాల్గొంటుంటాను. ఆ రోజు పొందిన శిక్షణను వీడియోగా తీసి మేడమ్‌కు వాట్సాప్ ద్వారా పంపిస్తుంటాను. ఖాళీ సమయాల్లో బనియన్ కంపెనీ స్టిక్కర్లు వేయడం తదితర పనులు చేస్తుంటాను. నాకు స్వంతంగా మృదంగం కొనిస్తానని అమ్మ చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉంది" అన్నాడు శ్రీవెంకటేశన్.



తల్లి తమిళ్‌సెల్వితో...

అన్నీ గమనించి... : మృదంగం, డోలక్ వాయించడంలో ప్రావీణ్యం సంపాదించినా వెంటనే కచ్చేరీలు అప్పగించ లేదు. కార్యక్రమం ముగిసే వరకు అతను కూర్చొని ఉంటాడా అని చాలా రోజులు పరిశీలించిన అనంతరం కచ్చేరీలకు పంపించారు. సాధారణంగా హైపర్ ఆక్టివ్ సమస్యతో బాధపడుతున్న వారు ఎక్కువ సేపు కూర్చోలేరు. మధ్యలోనే లేచి అల్లరి చేస్తుంటారు. వారిని ప్రతి సమయంలోను ఒకరు తప్పకుండా పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ, శ్రీవెంకటేశన్ అలా కాదు, మేడమ్ ఎలా చెబితే అలా చేస్తుంటాడు. కార్యక్రమం ముగిసేంత వరకు అక్కడే ఉంటాడు" అంటూ తల్లి తమిళ్ సెల్వి తెలిపింది.

మృదంగంపై శిక్షణ...

అతనికి ఏదైనా నేర్పించాలి అనుకొని, తొలుత పాటలు నేర్పించాలని నిర్ణయించాము. స్థానిక మందవెల్లిలో ఉన్న కలైమామణి లక్ష్మీ మేడమ్ ఉన్నారు. ఆమె ప్రత్యేక పిల్లలకు మాత్రమే నేర్పిస్తుంటారు. ముఖ్యంగా ఆటిజం చిన్నారులను ఆమె సంరక్షిస్తుంటారు. అందువల్ల శ్రీవెంకటేషన్‌ను ఆమె వద్ద చేర్పించాము. కానీ, పాట పాడే సమయంలో మధ్యలోనే నిలిపివేస్తుండేవాడు. దీనిని పరిశీలించిన మేడమ్, మృదంగం నేర్చుకోవాలని సూచించింది. అప్పటినుంచి మృదంగం నేర్చుకోవడం ప్రారంభించాడు. అలాగే, డోలక్, ఘటం తదితరాలు కూడా వాయించడం ప్రారంభించాడు.

ప్రస్తుతం మేడమ్ తాంబరానికి వెళ్లిపోయింది. మేము కూడా తిరుప్పూర్‌కు వచ్చాయి. అందువల్ల ఆన్‌లైన్ ద్వారా తిరుప్పూర్ నుంచే మేడమ్ వద్ద శిక్షణ పొందాడు. అన్ని సంగీత కచ్చేరీలు మేడమ్ ఏర్పాటుచేస్తుంటారు. కచ్చేరి ఉన్నప్పుడు ఫోన్ చేసి తమను రప్పించేవారు. మిగిలిన ప్రత్యేక పిల్లలతో కలసి శ్రీవెంకటేశన్ కచ్చేరీలలో పాల్గొంటుంటాడు. ఎవరైనా పాట పాడుతుంటే ఇతను మృదంగంతో వాద్య సహకారం అందిస్తుంటాడు.

స్థానిక భారతి విద్యాభవన్‌లో ఏడాదికి మూడు, నాలుగు రోజులు కచ్చేరీలో నిర్వహిస్తుంటారు. అలాగే, హైదరాబాద్‌లోని కృష్ణ మందిరంలోను, అక్కడి భారతీయ విద్యా భవన్ సంగీత కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నాడు. సంగీత కార్యక్రమాల్లో శ్రీ వెంకటేశన్ పాల్గొనేందుకు కారణం లక్ష్మీ మేడమ్. ఇటీవల అన్నైయార్ దినోత్సవం సంధ్బంగా రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కూడా లక్ష్మీ మేడమ్ కల్పించారు. ఇప్పటివరకు సుమారు 20 కచ్చేరీల్లో పాల్గొన్నాడు.

ఓటమిలోనే విజయపుదారులు వెతుక్కోవాలి : నటుడు శివకుమార్



'గరుడన్' థ్యాంక్స్ గివింగ్ మీట్ దృశ్యం

నేటి కాలంలో ఓటమిని ఏ ఒక్కరూ అంగీకరించడం లేదని, వాస్తవానికి ఓటమిలోనే సక్సెస్ దారులను వెతుక్కోవాలని సీనియర్ నటుడు శశికుమార్ సూచించారు. హాస్య నటుడు సూరి హీరోగా నటించిన 'గరుడన్' చిత్రం ఇటీవల విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ చిత్ర బృందం థ్యాంక్స్ గివింగ్ మీట్‌ను నగరంలో శుక్రవారం నిర్వహించింది. ఇందులో నిర్మాత కె.కుమార్, చిత్ర సమర్పకుడు ఫైవ్‌స్టార్ సెంథిల్, పంపిణీదారుడు చిదంబరం, దర్శకుడు దురై సెంథిల్ కుమార్, దర్శకుడు వెట్రిమారన్, నటుడు, దర్శకుడు శశికుమార్, హీరో సూరి, కెమెరామెన్ ఆర్థర్ ఏ విల్సన్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో శశికుమార్ మాట్లాడుతూ, 'ఇపుడు ఏ ఒక్కరూ ఓటమిని అంగీకరించడం లేదు. దీన్ని మార్చుకోవాలి. ఓటమి నుంచే విజయానికిదారులు వెతుక్కోవాలి. ఒక చిత్రం పరాజయంపొందితే తదుపరి చిత్రం హిట్ సాధించాలన్న తపనతో పనిచేస్తారు. తద్వారా సక్సెస్ సొంతమవుతుంది' అన్నారు. దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ, 'గరుడన్' చిత్రాన్ని సక్సెస్ చేసిన ప్రేక్షకులకు, మీడియాకు ధన్యవాదాలు. నేటికాలంలో ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చేందుకు ఏమాత్రం ఇష్టపడటం లేదు. డిజిటల్ ప్లాట్‌ఫాంలపై ఆధారపడుతున్నారు. గత మూడేళ్ళుగా ఈ విషయాన్ని నేను గమనిస్తున్నాను. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, టీవీ రైట్స్ నుంచి నిర్మాతకు లాభం వస్తుంది. థియేటర్ రిలీజ్ అనేది బోనస్ వంటిది' అన్నారు. హీరో సూరి మాట్లాడుతూ, 'ఒక స్టోరీ ఉందంటే దాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్ళడం, షూటింగ్ పూర్తి చేయడం, రిలీజ్ చేయడం వరకు ఒకే. కానీ, ఇలాంటి సక్సెస్ వేదిక లభించడం అనేది చాలా కష్టం. ఆ ప్రకారంగా నేను హీరోగా నటించిన ఈ చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షక దేవుళ్ళకు, మీడియాకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అలాగే, ఇతర యూనిట్ సభ్యులు కూడా ప్రసంగించారు.

చిత్రజ్యోతి

నావలూరులో హోమ్‌టౌన్ స్టోర్ ప్రారంభం



కొత్త స్టోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైలిన్ పద్మాశంకర్ తదితరులు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గృహోపయోగ వస్తువుల విక్రయం, అందమైన గృహాలంకరణ ఫర్నీచర్ వస్తువుల సరఫరాలో పేరుగడించిన హోమ్‌టౌన్ సంస్థ నగరంలోని నావలూరులోని వీరా మాల్‌లో కొత్త ఇంటీరియర్ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైలిన్ విద్వాంసురాలు వైలిన్ పద్మాశంకర్, టీసీఎస్ చెన్నై రిటైర్డ్ జనరల్ మేనేజర్ కేప్టెన్ స్టార్ట్ లారెన్స్, స్పెన్సర్‌ప్లాజా అండ్ బుకీఫీల్డ్స్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, రీటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సౌత్ రీజన్ హెడ్ వెంకట్‌రామ్,ప్రాక్సిస్ హోమ్ రీటైల్ లిమిటెడ్ సీఓఓ ఆశిష్ బుట్‌డా, వీరా మాల్ డైరెక్టర్ విజయ్ సదారంగని తదితరులు పాల్గొన్నారు. ఈ సంస్థ ద్వారా లివింగ్ రూమ్ ప్యాకేజీలు రూ.44,900లకు, లివింగ్, డైనింగ్‌రూమ్ ప్యాకేజీలకు రూ.69,900లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి పార్థసారథి ఆలయ బ్రహ్మోత్సవాలు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లోని వైష్ణవ దివ్యదేశం పార్థసారథి ఆలయంలోని నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈనెల 26 వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కల్పవృక్షవాహనం, శేష వాహనం, సింహవాహనం, సూర్య ప్రభ వాహనం, చంద్ర ప్రభవాహనం తదితర వాహనాలపై నరసింహస్వామి ఇష్టదేవేరుల సమేతంగా ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. గరుడ సేవ ఈ నెల 19న వైభవంగా జరుగుతుంది. ఈ నెల 23 ఉదయం మహారథోత్సవం కనులపండువగా జరుగనుంది. ఈ వేడుకలలో పాల్గొనున్న భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు ఆలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

19న నగరంలో నేచురల్లీ చెన్నై ఈవెంట్



విలేఖరుల సమావేశంలో నీనారెడ్డి తదితరులు

అడయార్, జూన్ 15: గ్రీన్ గాడ్డెస్ ఆధ్వర్యంలో నేచురల్లీ చెన్నై ఈవెంట్ ఐదో ఎడిషన్ ఈ నెల 19వ తేదీన నగరంలో జరుగనుంది. స్థానిక మైలాపూరులో ఉన్న ఓ నక్షత్ర హోటల్‌లో జరిగే ఈ ఈవెంట్ ముఖ్యోద్దేశమే స్థిరమైన జీవితాన్ని గడిపేలా కృషి చేయడం. గత 2019లో నినా రెడ్డి, ప్రీతి త్యారాజన్. జయశ్రీ వివేక్, మంజు ముదిట్, అంజు అగర్వాల్‌లు కలిసి ఈ గ్రీన్ గాడ్డెస్‌ను ప్రారంభించారు. సోలార్ ఎనర్జీ, రైన్ వాటర్ హార్వెస్టింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎకోఫ్రెండ్లీ ప్రొడక్ట్స్, హోలిస్టిక్ వెల్‌నెస్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ సంస్థ కృషి చేస్తుంది. ఒక రోజు పాటు జరిగిన నేచురల్లీ చెన్నై ఈవెంట్‌లో వివిధ రకాలైన వస్తువులను కొనుగోలు చేసేందుకు వెసులుబాటు కల్పించనున్నారు. ఈ నె 19వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు జరుగనుంది.

తిరుపత్తూరులో ఎట్టకేలకు పట్టుబడిన చిరుతపులి

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు వాసులను భయభ్రాంతులకు గురి చేసి, కంటికి నిదుర రాకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు పట్టుబడింది. అటవీశాఖ అధికారులు మత్తుమందు కలిపిన సూదిని తుపాకీ ద్వారా ప్రయోగించి దానిని పట్టి బోనులోకి ఎక్కించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు తిరుపత్తూరులోని జయరామన్ అనే వ్యక్తి ఇంటి వద్ద చిరుతపులి సంచరించింది. అక్కడి నుంచి బయలుదేరిన ఆ చిరుత పులి కలెక్టర్ ఆఫీసు వెనుకనున్న స్కూలు ప్రాంగణంలోకి చొరబడింది. ఆ సమయంలో స్కూలు ప్రహరీకి పెయింట్ చేస్తున్న గోపాల్ (55)పై ఆ చిరుత దాడి జరిపింది. ఆ దృశ్యాన్ని గమనించి సిబ్బంది, స్కూలు విద్యార్థులు భయంతో బిగ్గరగా కేకలు పెట్టారు. ఆ తర్వాత చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని మూడు బృందాలుగా మూడు వైపులా చుట్టుముట్టి చిరుతపులిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆ చిరుతపులి అక్కడి సమీపంలోని కారు షెడ్డు వద్ద సంచరిస్తుండగా అటవీ శాఖ అధికారులు తుపాకీతో మత్తుమందు సూదిని ప్రయోగించారు. కానీ ఆ పులి చాకచక్యంగా తప్పించుకుని ఓ మరుగుదొడ్డిలోకి దూరింది. వెంటనే అటవీ శాఖ అధికారులు మళ్ళీ దానిపై మత్తుసూదిని ప్రయోగించారు. దీనితో ఆ చిరుతపుల్లి మైకంలో పడింది. ఆ తర్వాత శనివారం వేకువజాము 2.25 గంటలకు పూర్తిగా మత్తులో ఉన్న చిరుతపులిని అటవీశాఖ సిబ్బంది దానిని బోనులో ఎక్కించి గడియపెట్టారు. ఆ తర్వాత చిరుతపులిని పట్టుబడిన విషయాన్ని మైకుల్లో తిరుపత్తూరు అంతటా ప్రకటించి, చిరుతపులి ఉన్న బోనును లారీలో ఎక్కించుకుని తిరుపత్తూరు అటవీశాఖ కార్యలయానికి తరలించారు. ఆ చోట వెటర్నరీ వైద్యులు ఆ చిరుతపులికి ప్రాథమిక చికిత్సలు చేశారు. ఆ తర్వాత ఆంధ్రా సరిహద్దుకు చేరువగా ఉన్న అభయారణ్యంలో ఆ చిరుతపులిని విడిచిపెట్టేందుకు అధికారులు తగు సన్నాహాలు చేపడుతున్నారు.



మరుగుదొడ్డి వద్ద కూర్చున్న చిరుతపులి, అటవీశాఖ సిబ్బది సిద్ధం చేసిన బోను

రజినీకాంత్‌కు ప్రతి నాయకుడిగా నటించాలనివుంది

... నటుడు వరదరాజన్ పళనిస్వామి



వరదరాజన్ పళనిస్వామి

సూపర్‌స్టార్ రజినీకాంత్‌కు ప్రతినాయకుడిగా నటించాలని ఉందని 'బుజ్జి ఎట్ అనుపట్టి' ఫేం వరదరాజన్ పళనిస్వామి తన మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఒక చిన్నారికి మేకకు మధ్య ఉన్న బంధాన్ని వివరిస్తూ తెరకెక్కించిన చిత్రం 'బుజ్జి ఎట్ అనుపట్టి'. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మాత్రమే కాకుండా సినీ విశ్లేషకుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఇందులో రహీంబాయ్ అనే పాత్రలో వరదరాజన్ పళనిస్వామి నటించారు. ఆయన పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. ఈ చిత్రం విజయంతో పాటు తన పాత్రకు వస్తున్న ప్రశంసలతో ఆయన ఉప్పొంగిపోతున్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ, 'నా లక్ష్యం, నా కల ఒక్కటే. అదే సూపర్‌స్టార్ రజినీకాంత్‌కు విలన్‌గా నటించాలన్నదే. ఇందుకోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను. చిన్న యవసు నుంచి నటన అంటే అమితమైన ఇష్టం. పాఠశాలల్లో నాటకాల్లో నటించి ఎన్నో బహుమతులు గెలుచుకున్నాను. కళాశాలల్లో, దేవాలయ వేడుకల్లో నాటకాల్లో నటించాను. స్టేజ్ డ్రామా అనుభవాలు నాలోని నటనను వెలికితీశాయి. నాటకాల్లో ఎక్కువగా స్త్రీ పాత్రల్లో నటించారు. వివిధ అంశాలపై తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన అనేక ప్రచార అవగాహన కార్యక్రమాల్లో నటించాను. ఈ చిత్రంలో నా నటనను చూసి అనేకమంది అభినందిస్తున్నారు. ఫోన్లు చేస్తున్నారు. ఈ చెన్నై నగరంలో సినిమా అవకాశాలను వెతుక్కుంటూ కలల ప్రపంచంలో ప్రయాణించే ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆరంభంలో నేను కూడా అనేక కష్టాలు ఎదుర్కొన్నాను. కానీ, పట్టువదలకుండా ప్రయత్నించి సినిమా అవకాశాలు దక్కించుకున్నాను' అని పేర్కొన్నారు.

'కన్నప్ప' సినిమా కాదు చరిత్ర : నటుడు శరత్ కుమార్



'కన్నప్ప' చిత్ర బృందంతో శరత్ కుమార్

టాలీవుడ్ హీరో మంచు విష్ణు ప్రధాన పాత్రలో తమిళం, తెలుగుతో సహా అనేక భాషల్లో తెరకెక్కుతున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమా గురించి సీనియర్ నటుడు శరత్ కుమార్ మాట్లాడుతూ, 'కన్నప్ప' ఒక సినిమా కాదు. ఇది మన చరిత్ర. ప్రతి ఒక్కరూ వారివారి పాత్రల్లో జీవించారు. ఇపుడు ఆ పాత్రల్లో మేం ఉన్నాం. ప్రతి ఒక్కరూ చరిత్రను మరిచిపోతున్నారు. మన చరిత్రను మనమే చెప్పాలి. ప్రతి ఒక్కరూ కన్నప్ప చరిత్రను తెలుసుకోవాలి. తమ సంతానానికి వివరించాలి. అపుడే చరిత్ర బతికివుంటుంది. చరిత్ర అనేది కేవలం పుస్తకాలకే అంకితంకారాదు. మన పిల్లలు కూడా తెలుసుకోవాలి. వారికి తెలియజెప్పాల్సిన బాధ్యత మనపైనే ఉంది' అని పేర్కొన్నారు.

త్వరలో చెన్నైలో 'విమాన టాక్సీలు'

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో రోజురోజుకూ అధికమవుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించి త్వరితగతిన నగరవాసులను నిర్దేశిత ప్రాంతాలకు తీసుకెళ్లేలా త్వరలో విమాన టాక్సీ సర్వీసులు ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధమైంది. ఆ మేరకు అమెరికాకు చెందిన బోయింగ్ విమాన సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకుంది. నగరంలో ప్రవేశపెట్టనున్న ఎయిర్ టాక్సీలుగా సంచరించనున్న ఈ బుల్లి విమానాలకు రన్‌వేలు అవసరం లేదని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. మిగ్ విమానాల్లా ఈ బుల్లి విమానాలు నిట్టనిలువుగా టేకాఫ్ అవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఏయే ప్రాంతాల్లో ఈ విమాన టాక్సీలు నడపాలనే విషయమై అధికారులు మ్యాప్‌లు, రూట్లకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. తొలుత ఈ విమాన టాక్సీలను విమానాశ్రయం నుండి సరకులను నగరంలోని పలు ప్రాంతాలకు చేరవేస్తూ ట్రయల్ రన్ కూడా నడపనున్నారు. ఇదిలా ఉండగా మద్రాస్ ఐఐటీకి అనుబంధంగా ఉన్న ఈ-ప్లేన్ సంస్థ దేశంలోనే తొలిసారిగా విద్యుత్‌చార్జ్ ద్వారా నడిచే విమాన టాక్సీలను రూపొందించింది. ఈ రకం విమానాలను ఒకసారి పూర్తిగా చార్జ్ చేసుకుంటే 200 కి.మీ. దూరం వరకు నడిపేందుకు వీలవుతుంది. హెలికాప్టర్ల కంటే సులువుగా ఈ బుల్లి విమాన టాక్సీలు రన్‌వేలతో నిమిత్తం లేకుండా టేకాఫ్ చేయగలుగుతాయి.

హిందుస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్ పదో వార్షికోత్సవం



అడయార్, జూన్ 15: దేశంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ అనుబంధ పాఠశాల హిందుస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్ విజయవంతంగా పదో వార్షికోత్సవాన్ని జరుపుకొంది. ఈ సందర్భంగా కేంబ్రిడ్జి ఇంటర్నేషనల్ ఎగ్జామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన మాస్టర్ పవన్ శక్తివేల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అన్ని సబ్జెక్టుల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ఏ లెవల్ గ్రేడ్ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారు. అలాగే, మాస్టర్ రిశ్వంత్ శ్రీకాంత్, రిడా, హర్షిత జైన్‌లు కూడా మంచి మార్కులు సాధించారు. ఇలా గత పదేళ్ళుగా అన్ని విభాగాల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న ఈ స్కూల్ ఈ నెల శుక్రవారం తన పదో వార్షికోత్సవాన్ని జరుపుకుంది. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'తప్పాట్టం' మూవీ పోస్టర్‌ను ట్యాగ్ చేసిన ఎలాన్ మస్క్!!



'తప్పాట్టం'లో ఓ దృశ్యం

దురై సుధాకర్, డోనా రొసారియో కలిసి నటించిన 'తప్పాట్టం' మూవీ పోస్టర్‌ను ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం ట్విటర్ (ఎక్స్) యజమాని ఎలాన్ మస్క్ ట్యాగ్ చేశారు. ఒక కొబ్బరిబొండాంలో హీరోయిన్ ఒక స్ట్రాతో అందులోని నీటిని తాగుతుండగా, హీరో మాత్రం హీరోయిన్ నోటిలో మరో స్ట్రా పెట్టి ఆ నీటిని సేవించేలా ఈ చిత్ర పోస్టర్‌ను డిజైన్ చేశారు. దీన్ని ఎలాన్ మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో ట్యాగ్ చేయడంతో ఇది వైరల్ అయింది. కొబ్బరిబొండాంలోని నీటిని సేవించే సమయంలో ఇద్దరు వ్యక్తులు రెండు స్ట్రాలు వేసి తాగుతారు. కానీ, ఇక్కడ విచిత్రంగా ఒక స్ట్రా కొబ్బరిబొండాలో, మరో స్ట్రా హీరోయిన్ నోటిలో ఉంది. దీనిపై ఎలాన్ మస్క్ కామెంట్స్ చేస్తూ 'హా ఇంటెలిజెన్స్ వర్క్స్' అంటూ ప్రసంశిస్తూ ట్వీట్ చేశారు. దీంతో చిత్ర హీరో దురై సుధాకర్‌కు చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, 'మా చిత్ర పోస్టర్ ఎలాన్ మస్క్ దృష్టిలో పడటం, దాన్ని ఆయన ట్యాగ్ చేస్తూ, ట్వీట్ చేయడం చాలా సంతోషంగా, ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు.